# జీవితరంగం

## – స్వరాజ్య పద్మజ కుందుర్తి



వందేళ్ళ క్రిందట.. ఇద్దరు అమ్మాయిలు, పదేళ్లకే వితంతువులయ్యారు, అమ్మానాన్నలు లేరు, నమ్మినవారు ఆస్తి అంతా దోచేశారు, జీవితాంతం ఎలా గడపాలి? జీవితపోరాటాన్ని కొనసాగిస్తూనే గాంధీగారి పిలుపునందుకుని స్వాతంత్ర్యోద్యమంలోకి దూకారు, ఎక్కడో బహిరంగసభలో తలిదండ్రులనుంచి తప్పిపోయి ఏడుస్తున్న పసిపాపను అక్కున చేర్చిపెంచుకున్నారు, ఒకవైపు తమదైన జీవనపోరాటం, మరోవైపు దేశంకోసం పోరాటం.. వీళ్ళు చరిత్రపుటల్లో కనిపించకపోవచ్చు, పెద్దల ఉపన్యాసాల్లో వినిపించకపోవచ్చు.. కానీవాళ్ళు ప్రదర్శించిన ఆ పోరాటపటిమ గురించి తెలుసుకుంటుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది, నిలువెత్తు స్ఫూర్తిశిఖరాలు కళ్ళముందు కదులుతాయి. వాళ్ళపేర్లు- కనుపర్తి హనుమాయమ్మ,కొండా సత్యవతమ్మలు. అలనాటి వాస్తవ సంఘటనలను వారి మనవరాలు స్వరాజ్య పద్మజకుందుర్తిగారు నెలనెలా కథన రూపంలో మనకందిస్తున్నారు.



కనుపర్తి హనుమాయమ్మగారు



కొండా సత్యవతమ్మగారు

## కథ ఇక మొదలు

**శివరాత్రినాడు** మా నరసరావుపేట పక్కనే ఉన్న కోటప్పకొండలో పెద్ద తిరణాల జరుగుతుంది. ఆంధ్రదేశం అంతటినుండీ ఎక్కడెక్కడి ఊళ్ళ జనం కోటప్పకొండకు వస్తారు. ఇంకా అక్కడి ప్రత్యేకత ఏమిటంటే 'ప్రభలు '.ఆ ప్రభలు పూలూ ,రంగు రంగుల కాయితాలూ ,దేవుడి బొమ్మలూ అలంకరించి దాదాపు యాభై అడుగుల ఎత్తులో భలే అందంగా వుండేవి. ఏకాదశి నుంచీ మొదలైన జనప్రవాహం శివరాత్రికి సముద్రమంత పెరిగి పోయేది . చిన్నాపెద్దా వేలల్లో వచ్చేవి 'ప్రభలు 'కోటొక్క ప్రభలు వస్తే కోటయ్యసామి (శివుడు )కొండదిగి వస్తాడని" జనం లోని మాట .కొండమెట్లన్నీ ఎక్కి కోటయ్య దర్శనం చేసుకునే సరికి అర్ధరాత్రయ్యేది. మెట్లు ఎక్కలేక అవస్థలు పడుతూ , "చేదుకో ...కోటయ్యా ..చేదుకో "అనే అరుపులతో కొండ మారుమోగి పోయేది.

అదుగో ...ఆ తిరణాల ఐపోయాక సరిగ్గా వారానికి మావూరు 'రూపెనగుంట్ల 'తిరణాల జరిగేది. మా ఆంజనేయ స్వామి గుడి తిరణాల అది. ఆరోజు విగ్రహప్రతిష్ఠ జరిగిన రోజట. చిన్న ఊరయినా పెద్ద తిరణాల జరిగేది. కోటప్ప కొండలో దుకాణాలు పెట్టుకున్న బొమ్మలవాళ్ళూ ,నెమలీకలమ్మే చెంచులూ ,మూలికలమ్మే కోదులూ ,ముక్కాలిపిటలూ రోకళ్ళూ మొదలైన చెక్కసామాన్లు అమ్మే వడ్రంగులూ ,గొలుసులమ్మే

పుసలోళ్ళూ ,చేటలూ వెదురు జల్లెడలు అమ్మే మేదర్లూ ,చీరలమ్మే సాలెవాళ్ళూ ,చెక్కభజనలు చేసే సాతాని వాళ్ళూ ,పరుపులూ దిండ్లూ అమ్మే దూదేకుల సాయిబులూ ,కత్తులూ కొడవళ్ళూ గునపాలూ అమ్మే కంసళ్ళూ ,అత్తర్లు అమ్మే బడేసాయిబులూ ఒక్కళ్ళని ఏమిటి ?మావూరు వూరంతా భలే సందడిగా ఉండేది. వీటికి తోడు తిరణాలకు ఇంటికొచ్చిన ఆడపిల్లలతోనూ ,అతిధులతోనూ ఇళ్ళు కళ కళ లాడేవి. తిరణాలకు అందరి ఇళ్ళలోనూ చేసే అరిసెలవాసనతో వూరు గుమ్మెత్తిపోయేది.

ఆ తిరణాలకు ముందురోజే పేటనుండి ఊరికి వెళ్ళేవాళ్ళం. ఎందుకంటే అర్ధరాత్రినుంచీ మొదలైన అభిషేకం తెల్లారుఝాము వరకూ జరిగేది. స్వామికి అలంకరణ పూర్తయ్యాక తొలిపూజ మాదే .నిద్రకళ్ళతోటే లేపేసి ,చల్లటినీళ్ళు తలమీదపోసేసి గబగబా రడీ చేసేవాళ్ళు ,మమ్మల్ని అమ్మా చిన్నమ్మమ్మా ఇద్దరూ కలిసి .అయ్యో !పూజకు వేళవుతున్నదని గబగబా వెళ్ళేవాళ్ళం. ముందుగా మా గోత్ర నామాలతో పూజ చేయించి,మాకు తీర్ధప్రసాలిచ్చి తరువాత అందరికీ అనుమతిచ్చేవాడు. మా గుడి పూజారి శీనాచార్యులవారు.

గుడిముందరి రావిచెట్టు చప్టామీద కూర్చుని ప్రసాదం తింటూ అడిగాను అమ్మమ్మని. "అమ్మమ్మా మొదటి పూజ మనకే ఎందుకూ ?ప్రతిసారీ మనమే మొదటి పూజ ఎందుకు చేసుకుంటాం ?".అని

అప్పుడు అమ్మమ్మ "ఈ గుడి మనదేనే ,అంటే దీన్ని మానాన్నే కట్టించాడు. అందుకే మనకు తొలిపూజ" అంది.

నేను ఆశ్చర్యంగా "అవునా! అమ్మమ్మా! ఇంత విగ్రహం ఎక్కడిదీ?" అని అడిగా.

"స్వయంగా ఆస్వామే వచ్చాడే "అంది.

నేనింకా ఆశ్చర్యంగా "స్వామే వచ్చాడా ?ఎలా"

అని అడుగుతుంటే ..."అదో పెద్ద కధలేవే" అని దాటేసింది.

నేవదలకుండా "అమ్మమ్మా .... చెప్పవా ...ప్లీజ్ అనివెంటబడితే

"సర్లే !రాత్రికి చెపుతా ..పో ...తిరణాల చూడు." అని పంపేసింది.

ఊరికి కాస్త దూరం లో గుడీ ,గుడిముందు కొంచెం పక్కగా విస్తరించిన పెద్ద రావిచెట్టూ ,గుడి ఎదురునుంచి మొదలై ఊరిమధ్యలో నుంచి వూరి చివరికంటా సాగిన పెద్ద ప్రధానమైన రోడ్డు అది. ఈ రోజు తెల తెల వారుతూనే రకరకాల దుకాణాలతో మెరిసి పోతోంది.

నేనూ మా చెల్లీ చెరుగ్గడ కొట్టించుకోని పళ్ళతోటి లాగి నములుకుంటూ, దుకాణాలు చూస్తూ పోతుంటే ..గాజుల మలారంతో ఎదురైన సాంబయ్య "ఓ అమ్మాయ్" అని పిలిచి "గాజులేపించుకో బోసిగా వుండాయి చేతులు " అనిపిలిచాడు.

ఒద్దొద్దు అని పక్కకెళ్ళబోతే ..."రామ్మా ..ఇప్పుడే వచ్చినా ..బోణీ సెయ్యమ్మా ...సిట్టెమ్మగోరి మనవరాలివేగా! ఆ యమ్మకాడ తీసుకుంటాలే డబ్బులు" అంటూ రెండు చేతులనిండా ఆకుపచ్చగాజులు తొడిగి "తెల్లని సేతికి పచ్చని గాజులు ఎంత బాగుండాయో "అని మెటికలు విరిచాడు. చెల్లికి ఎర్రని రెండు పెద్ద ప్లాస్టిక్ గాజులు తొడిగి ,"అబ్బో !సిట్టెమ్మ గారి మనవరాళ్ళ పుటకే వేరబ్బా !ఈ పిల్లలే అలాదు ..."అని మురిసిపోయాడు. చుట్టూ మూగిన వాళ్ళు "ఓ సాంబయ్యో !!మాకూ అట్టాటియ్యే యెయ్యి!" అనగానే "ఇంగ సాల్లే ఆపండి !ఆళ్ళ కయ్యి బాగుంటాయి. మీకేం బాగుంటాయో సూసి ఏత్తా కూకోండి "అని బేరం లో పడిపోయాడు.

ఇద్దరం కాళ్ళు నెప్పి పుట్టేలా తిరిగి రంగులరాట్నమెక్కి మధ్యలో పుల్లైసూ ,పీచుమిఠాయీ ,ఇంకా మాతిరణాలకే ప్రత్యేకమైన బెల్లపు మిఠాయీ కొనుక్కుని ఆచారి గారింటికి చేరాం. ఆపూట అక్కడే భోజనాలు మాకు. మళ్ళీ చల్లబడ్డాక బయలుదేరి అక్కడక్కడ పెట్రోమాక్స్ లైట్లతోనూ ,కొద్దిపాటి కరెంటు దీపాలతోనూ ,మరీ చిన్న దుకాణాలైతే కిరసనాయిలు బుడ్డి దీపాలతోనూ వెలుగుతున్న షాపులు తిరిగి, నేనేమో పుల్లకు తగిలించి వుండి రెండు అరచేతుల మధ్యలో ఉంచుకుని అటూ ఇటూ కవ్వంలా తిప్పుతుంటే చెతులూ కాళ్ళూ ఆడించే జోకర్ బొమ్మా ...మా చెల్లాయేమో ఒక బొంగరం (ఎప్పుడూ మొగపిల్లల ఆటలని అమ్మ అరిచేది కూడా దాన్ని )కొనుక్కుని ఇల్లు చేరాం.

రాత్రికి అన్నాలుతిని ఆరుబైట మంచాలమీదికి చేరగానే అమ్మమ్మ పక్కలో దూరి అడిగేను.

"అమ్మమ్మా ! స్వయంగా ఆంజనేయస్వామే ఎలావచ్చాడూ ? చెప్పవా .."అని నసపెట్టుకున్నా.

"ఓసినీ ఇల్లు బంగారంకానూ ..మర్చిపోలేదుటే నువ్వూ ..ఇది చెప్పాలంటే మానాయనమ్మ దగ్గరినుండీ మొదలు పెట్టాలి. చాలా కధుందే ..మళ్ళీ చెబుతాలే "అన్నా ఊరుకోక "చెప్పు అమ్మమ్మా ..లేకపోతే నేనూరుకోను ...నే పెద్దయ్యాక నిన్నసలు విమానమే ఎక్కించను "అని బెదిరించేసా ...ఎందుకంటే మా అమ్మమ్మ మమ్మల్ని ఎప్పుడూ "మా బంగారుతల్లులు పెద్ద చదువులు చదివి విమానాల్లో తిరగాలి,నన్నుకూడా ఎక్కించుకోని "అంటుందిగా అందుకని .

"ఓసి భడవా !" అని పకపకానవ్వి కథమొదలు పెట్టింది అమ్మమ్మ .ఊ కొడుతూ అమ్మమ్మ చెప్పే దృశ్యాలన్నీ ఊహించుకుంటూ కళ్ళు మూసుకుని వినసాగాను కథ. మా అమ్మమ్మ ముందు తరాల కథ !!

★★★

తూరుపు తెల్లారి చాలాసేపవుతోంది. పల్లె నిద్రలేచి కూడా చాలాసేపయింది. ఆవూరి కరణం దశరథ రామయ్యగారి కచేరీ చావిడి అప్పుడే మనుషులతో కళకళ లాడుతోంది. పొద్దున్నే కరణం గార్ని చూడందే పొద్దుపోదు అనుకుంటూ వచ్చే మునసబు సాంబయ్య ,వెట్టివాడు కోటయ్య ,రోజూ వచ్చే పెదకాపు చలమయ్యా ...రావాల్సిన అందరూ వచ్చేశారు. వాళ్ళ ముక్కుపుటాలకు కమ్మగా సోకుతున్నది ఆ చుట్టుపక్కల పదూళ్ళలో ఎక్కడా ఎవరికీ తెలియని కమ్మని వాసన ........కరణం గారి అమ్మగారు కుంపటి ముందు కూర్చొని విసనకర్రతో విసురుతూ నీళ్ళు కాచి ఇత్తడి ఫిల్టర్ లో కమ్మని నీలగిరి గింజల పొడివేసి అందులో వేడినీళ్ళు పోసి డికాషన్ వేస్తుంటే వచ్చే కమ్మని కాఫీ వాసన !జీతగాడుపట్టుకొచ్చిన కంచు పాలచెంబులోనించి చెన్నపట్నం స్టీలు గిన్నెలోకి పాలువంచి కుంపటి మీద పెట్టిందావిడ. వసారాలో కూచున్న అందరి చూపూ ఇంటి గుమ్మం కేసే ...పెద్దావిడ పంపించే కాఫీ కోసమే.

ఆపాటికే కరణం గారి స్నానమూ ,జపమూ , సంధ్యా వందనమూ పూర్తి అయిపోయాయి. ఉంగరాల జుట్టంతా వెనక్కి దువ్వి వేసిన ముడీ ,నుదిటిమీద శ్రద్ధగాదిద్దుకున్న తిలకం బొట్టూ తో అపర శ్రీరామ చంద్రునిలా వెలిగిపోతున్నారాయన. భార్య అందించిన కోటూ తలపాగా చేతిలోకి తీసుకుని ఆమెను చూసి ఒకసారి" వెళ్ళొస్తా "నన్నట్లుగా తలపంకించి వసారావైపు కదిలారాయన. అంతమాత్రానికే సిగ్గుల మొగ్గై నిలబడిపోయిన ఆవిడ "అమ్మాయ్ ....సరస్వతీ ..." అన్న అత్తగారి కేకకి ఉలిక్కిపడి ,"వస్తున్నా ...అత్తయ్యా" అని పరుగులాంటి నడకతో వెనుక వంటింటి ప్రక్కగా వసారాలో కుంపటిముందు కూర్చున్న అత్తగారి దగ్గరికి వెళ్ళింది. ఆ గజ్జెల చప్పుడుకీ ,గాజుల చప్పుడుకీ చిన్నగా నవ్వుకుంటూ చావిడి లోకి అడుగుపెట్టారు దశరథ రామయ్యగారు. ఆయన్ను చూస్తూనే చలమయ్యా ,కోటయ్యా నిలబడి "దండాలండే "అని చేతులు జోడించారు. మునుసుబు మాత్రం లేవాలా వొద్దా అని సందేహిస్తూనే సగం లేచి రెండుచేతులూ జోడించాడు. నవ్వుతూ ప్రతి నమస్కారం చేసి "కూర్చోండి ...కూర్చోండి "అని తనూ కుర్చీలో కుచున్నారాయన. వెట్టివాడు కోటయ్య తలగుడ్డ చేతిలోకి తీసుకుని గడపలో కూచున్నాడు.

అందమైన ఆ దృశ్యాన్ని ఉహించుకుంటున్న నాకు మధ్యలోనే వచ్చేసింది డౌట్!

"అమ్మమ్మా ఇంతకీ దశరథ రామయ్యగారు ఎవరూ ?" అని అడిగాను.

తన్మయత్వంగా చెబుతున్న అమ్మమ్మ "అబ్బాఇంకెవరే ! మా నాన్న. సరస్వతమ్మ మా అమ్మ" అంది.

"ఒహో కరణంగారి అమ్మగారంటే మీ నానమ్మ కదా! ఐతే మీ నాన్నగారు కరణమా ? ఏవూరికీ ?"అడిగాను.

"ఇంకే వూరికీ ఈవూరికేనే ...మానాన్న ఈవూరి కరణం." అమ్మమ్మ గొంతు కొద్దిగా వణికింది. తండ్రి గుర్తొచ్చిన విషాదమేమో అప్పుడు నాకు తెలియదు. వెంటనే "ఇంక చాల్లే నిద్రొస్తోంది పడుకో "అని చిచ్చి కొట్టసాగింది. "అదికాదు అమ్మమ్మా ..నీలగిరి గింజల పొడి అంటే ఏమిటి ? కాఫీ పొడేనా ?మునసబు అంటే ఎవరూ ?"నా ప్రశ్నల పరంపర కొనసాగుతూనేఉంది.

అమ్మమ్మ మౌనంగా ఉంది. భరించలేని బాధేదో ఆమె కంఠాన్ని నొక్కేసేఉంటుంది. తన మూలస్థానమైన తనవూరి గురించిన ఆలోచనలేవో ఆమె అంతరంగాన్ని ముళ్ళకంపలా చీరేస్తూ ఉండుంటాయి. ఆమె అంతరంగాన్ని గ్రహించే ఈడుకాదు నాది. ఆ మౌనపు మాటలమర్మం పెద్దయిన తరువాతగానీ తెలియలేదు నాకు. నెమ్మదిగా నిద్రాదేవి ఆవహించేసింది నన్ను ఇద్దరం చల్లగాలిలో చిరుచలిలో ఆకాశం దుప్పటికింద హాయిగా నిద్రపోయాం.

*(కొనసాగింపు వచ్చే సంచికలో..!)*

Post your comments